సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 15 । ఆగస్టు । 2025



మద్యానికి దూరం.. చారిగాం

కాగజ్‌నగర్ మండలం చారిగాం గ్రామస్తులంతా మద్యపాన నిషేధాన్ని కొనసాగిస్తున్నారు. 35 ఏళ్ల క్రితం గ్రామ పెద్దలు చేసిన తీర్మానానికి నేటికీ కట్టుబడి ఉన్నారు. IIలో▸

ప్రమాదకరంగా స్తంభాలు



ఉట్నూర్ పట్టణంలో ఇనుప విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. వాన కురుస్తున్నపుడు వాటిపై మెరుపులు వస్తుండగా స్థానికులు భయాందోళన చెందుతున్నారు. IIIలో▸

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

క్రమశిక్షణతో ట్రైనింగ్ పొందాలి



రికార్డులు పరిశీలిస్తున్న వీపీ సింగ్

ఆదిలాబాద్‌రూరల్: ఎన్‌సీసీ కెడెట్లు దేశ సమైక్యతకు క్రమశిక్షణతో ట్రైనింగ్ పొందాలని కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ వీపీ సింగ్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు) ఎన్‌సీసీ యూనిట్‌ను సందర్శించారు. ఆయనకు ప్రిన్సిపల్ డాక్టర్ శివకృష్ణ, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ పుట్ట లక్ష్మణ్, ఎన్‌సీసీ కెడెట్లు ఘనస్వాగతం పలికారు. అనంతరం వీపీ సింగ్ కళాశాల యూనిట్ రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంజేశారు. సామాజిక బాధ్యత పెంచుకోవాలని కెడెట్లకు సూచించారు. ఎన్‌సీసీ కెడెట్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మనోహర్

నార్నూర్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఏజెన్సీ జిల్లా అదనపు వైద్యాధికారి కుడ్మేత మనోహర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ, ఏఎన్‌సీ రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, గ్రామాలకు వెళ్లి వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని, గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు ఆశ కార్యకర్తల ద్వారా తెలుసుకోవాలని పేర్కొన్నారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సీహెచ్‌సీ డీడీవో డాక్టర్ జితేందర్‌రెడ్డి, హెచ్‌ఈ తులసీదాస్ రాథోడ్, చౌహాన్ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చరణ్‌దాస్ చౌహాన్ తదితరులున్నారు.

18నుంచి సర్వేయర్ల శిక్షణ

కైలాస్‌నగర్: తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈనెల 18నుంచి అక్టోబర్ 22 వరకు లైసెన్స్‌డ్ సర్వేయర్లకు రెండో విడత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా సర్వేల్యాండ్ రికార్డ్స్ ఏడీ ఎం రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. శిక్షణకు హాజరయ్యే అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఒక జిరాక్స్ సెట్, ప్రభుత్వ సివిల్ సర్జన్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్, రెండు లేటెస్ట్ పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో 18న ఉదయం 10 గంటలకు జిల్లా కేంద్రంలోని టీటీడీసీలో హాజరు కావాలని సూచించారు. కాగా, మొదటి విడత శిక్షణ పొంది పరీక్షకు హాజరైన అభ్యర్థులు ఏ సబ్జెక్టులో ఫెయిలయ్యారో, ఆ సబ్జెక్టు పరీక్షకు మాత్రమే హాజరు కావాలని సూచించారు.

స్టడీ సర్కిల్‌ను కొనసాగించాలి

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని గిరిజన ఆశ్రమ బాలుర రెసిడెన్షియల్ పాఠశాలలో కొనసాగుతున్న స్టార్-50 స్టడీ సర్కిల్ సెంటర్‌ను యథావిధిగా కొనసాగించాలని తుడుందెబ్బ నాయకులు కోరారు. గురువారం కలెక్టర్ రాజర్షి షాను కలెక్టరేట్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఆదిలాబాద్‌లోని బాలుర, బాలికల ఆశ్రమ పాఠశాలలు, స్టార్-50 సెంటర్‌ను కలిపి సీవోఈ పాఠశాలగా ఏర్పాటు చేయడం ఆదివాసీ విద్యార్థులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తోందని పేర్కొన్నారు. సంవత్సరానికి 480 సీట్లు కలిగిన పాఠశాలలను సీవోఈగా ఏర్పాటు చేస్తే ఎంపీసీ, బైపీసీలో 40 చొప్పున మొత్తం 80 సీట్లు మాత్రమే ఉంటాయని, దీంతో ఆదివాసీ విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే అవకాశముందని తెలిపారు. ఆదివాసీ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను యథావిధిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, డివిజన్ అధ్యక్షుడు ఆత్రం గణపతి, ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సలాం వరుణ్ ఉన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే పాయల్ శంకర్, నాయకులు


ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో గురువారం భారీ తిరంగా ర్యాలీ నిర్వహించగా ప్రధాన వీధులు త్రివర్ణ శోభితమయ్యాయి. విద్యార్థుల దేశభక్తి నినాదాలతో చౌరస్తాలు మార్మోగాయి. ర్యాలీని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ విజయం అద్వితీయమని పేర్కొన్నారు.

అవినీతే సమస్య..!


- అందరికీ దక్కని స్వేచ్ఛ–సమానత్వం
- చట్టసభలు, అధికార యంత్రాంగం నిజాయతీగా పని చేయాలి
- అప్పుడే అందరికీ స్వాతంత్య్ర ఫలాలు
- 78ఏళ్ల స్వాతంత్య్ర భారతంపై ప్రజల మనోగతం
- 'సాక్షి' సర్వేలో వెల్లడి

భారతావని స్వాతంత్య్రం సాధించి 78 వసంతాలు పూర్తి చేసుకుని 79వ సంవత్సరంలోకి ప్రవేశిస్తోంది. స్వతంత్ర భారత్ అనేక రంగాల్లో తనదైన ముద్ర వేస్తూ అభివృద్ధి వైపు దూసుకెళ్తోంది. శాస్త్రసాంకేతిక రంగాల నుంచి అంతరిక్షం వరకు ఎన్నో విజయాలు సాధిస్తోంది. స్వతంత్ర భారతంలో ఇన్నేళ్లలో ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య, స్వేచ్ఛ–సమానత్వం, నిజాయతీగా పని చేయాల్సిన రంగాలపై ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువత, మహిళలు, పురుషులు 140 మందిని 'సాక్షి' సర్వే చేసింది. ప్రస్తుత సమాజంలో అవినీతి ప్రధాన సమస్యగా మారిందనే అభిప్రాయం వ్యక్తమైంది. అందరికీ స్వేచ్ఛ–సమానత్వం లభించడం లేదని స్పష్టం చేశారు. స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే చట్టసభలు, అధికారయంత్రాంగం మరింత నీతి, నిజాయతీగా పని చేయాలని సమాధానం ఇచ్చారు. – కాగజ్‌నగర్‌టౌన్/నిర్మల్‌ఖిల్లా/మంచిర్యాలటౌన్/ఆదిలాబాద్


మీరు ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఏది..



స్వేచ్ఛ–సమానత్వం అందరికీ చేరుతోందా..



స్వాతంత్య్ర ఫలాలు అందరికీ దక్కాలంటే.. మరింత నీతి, నిజాయతీగా పనిచేయాల్సిన రంగం..



ఉన్నత విద్యను ఉచితం చేయాలి



వెనుకబడిన ప్రాంతాలను విద్యాపరంగా అభివృద్ధి చేయాలి. విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యాన్ని కల్పించాలి. ముఖ్యంగా పౌరులందరికీ ఉన్నత విద్య అవకాశాలను ఉచితంగా అందించాలి. ఉచితవిద్య, విద్యాభ్యాసానికి అవసరమైన వసతులు, బోధన సామగ్రి ప్రభుత్వమే సమకూర్చాల్సిన అవసరముంది. – ఎండీ రిజ్వాన్

లింగ వివక్ష నివారించాలి



2047 వరకు మహిళల రక్షణ విషయంలో భారతదేశం సురక్షితమైన దేశంగా ఎదగాలి. మహిళలకు అన్ని రంగాల్లో సముచిత అవకాశాలు కల్పించాలి. వారి అభిప్రాయాలకు విలువ ఇవ్వాలి. దేశంలో లింగ వివక్ష లేకుండా చూడాలి. కుల, మత, పేద, ధనిక అనే తారతమ్యాలు లేకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. – టీ సాయితేజ

ఎన్నికల్లో పారదర్శకత అవసరం



అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన ఇండియాలో ఎన్నికల వ్యవస్థ మరింత పటిష్టవంతంగా ఉండాలి. ఆరోపణలు, విమర్శలు లేకుండా ప్రక్రియ సజావుగా సాగాలి. ఎన్నికల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ఎన్నికల కమిషన్ వ్యవహరించాలి. ఇటీవలి కాలంలో వస్తున్న ఆరోపణలు ఈసీ నిబద్ధతను ప్రశ్నిస్తున్నాయి. – ఎం.సాయిసృజన్

అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలి



శత వసంతాల స్వాతంత్య్ర భారతంలో ప్రతీ చిన్నారికి నాణ్యమైన విద్య అందుబాటులోకి రావాలి. జాతి, మత, కుల, భాష, ప్రాంతీయ భేదాలు లేకుండా ఉచితవిద్య అందించాలి. ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలి. నూతన టెక్నాలజీపై పరిజ్ఞానం పెంచుకుని సాంకేతిక ప్రగతికి ప్రభుత్వం పాటుపడాలి. – ఒజ్జల వైభవ్

రైతు సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి



రైతులు విత్తనాలు, ఎరువుల కొరతతో ప్రతీ సీజన్‌లో ఇబ్బందులు పడుతున్నారు. నకిలీ విత్తనాలతో చాలామంది మోసపోతున్నారు. ఇలాంటి వాటిపై కఠినచర్యలు తీసుకోవాలి. రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించాలి. ఈ నేపథ్యంలో ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తే బాగుంటుంది. – ఎం.యువనశ్రీ

అగ్రదేశంగా నిలుపుదాం

రాజకీయంలో నిబద్ధత పెరగాలి



భారత రాజ్యాంగం ఎంతో ఉన్నతమైంది. ఎన్నో ఆకాంక్షలు, అభివృద్ధి, ప్రణాళికలు, అందరి హక్కులు, బాధ్యతలకు సమప్రాధాన్యతనిస్తూ రూపొందించబడింది. రాజ్యాంగం నిబంధనలకు అనుగుణంగా రాజకీయ నాయకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. నిబద్ధతతో మెలగాలి. – ఎ.స్రవంతి

ఆర్థికంగా అగ్రస్థానంలో నిలవాలి



ఆర్థికాభివృద్ధిలో దేశం వేగంగా ముందుకు సాగుతోంది. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తే ప్రొడక్టివిటీ పెరుగుతుంది. ఫలితంగా పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరుతుంది. 2047 వరకు మన దేశం ఆర్థికంగా అగ్రస్థానంలో నిలవాలి. పేదరిక నిర్మూలనకు విప్లవాత్మక చర్యలు చేపట్టాలి. – వై.వైష్ణవి

దేశభక్తిని మనసులో నింపుకోవాలి



స్వాతంత్య్ర, గణతంత్ర దినోత్సవాల సందర్భంగా కొందరు సోషల్ మీడియాలో దేశభక్తిని చాటుతుంటారు. సాధారణ రోజుల్లోనూ ఇది కనిపించాలి. మన సంస్కృతి, విలువలను కాపాడుకుంటూ గొప్పగా ప్రవర్తించాలి. సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ దేశ ప్రగతికి పాటుపడాలి. దేశభక్తిని మనసులో నింపుకోవాలి. – డీ అనుదీప్తి

సాంకేతికత వైపు సాగాలి



రోజురోజుకూ పెరిగిపోతున్న టెక్నాలజీ దేశాభివృద్ధికి తోడ్పడాలి. అవసరమైన టెక్నాలజీని వినియోగించుకుని నిరుద్యోగ యువత ఆర్థిక స్వావలంభన దిశగా ముందుకుసాగాలి. విద్యతోనే అన్నిరంగాల్లో ముందుకు సాగవచ్చు. అందరికీ ఉన్నతవిద్య అందించేలా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలి. – కే సింధు



మాట్లాడుతున్న డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్



కార్యక్రమంలో పాల్గొన్న ఛాత్రోపాధ్యాయులు

- పేదరికం, నిరుద్యోగాన్ని నిర్మూలించాలి
- అవినీతి అంతానికి చర్యలు చేపట్టాలి
- ఉచిత విద్య అందుబాటులోకి రావాలి
- వందేళ్ల భారతం అంశంపై 'సాక్షి' టాక్ షో
- అభిప్రాయాలు పంచుకున్న ఛాత్రోపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 78 ఏళ్లు గడిచి 79వ వసంతంలోకి అడుగుపెడుతున్నా ఇంకా చాలామంది దారిద్య్ర రేఖకు దిగువనే ఉన్నారు. కూడు, గూడు, గుడ్డ కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. ప్రపంచం సాంకేతిక రంగంలో ముందుకు దూసుకుపోతున్నా.. ఇంకా చాలామంది పేదరికంలో మగ్గుతూనే ఉన్నారు. అందరికీ నాణ్యమైన ఉచితవిద్య అందడం లేదు. యువతీయువకులు నిరుద్యోగ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. 2047 నాటికి సుపరిపాలన, టెక్నాలజీ, విద్య, వైద్యం ఇలా అన్ని రంగాల్లో దేశం ముందుండాలని ఛాత్రోపాధ్యాయులు ఆకాంక్షించారు. 'సాక్షి' గురువారం జిల్లా కేంద్రంలోని డైట్ కళాశాలలో నిర్వహించిన టాక్ షోలో వారి అభిప్రాయాలు పంచుకున్నారు. దేశం అభివృద్ధి వైపు పయనిస్తోందని, యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా ముందడుగు వేయాలని డైట్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కోల కిరణ్‌కుమార్ సూచించారు. డిబేట్‌లో డైట్ కళాశాల అధ్యాపకులు విజయలక్ష్మి, సాగరిక, సంగీత, ఛాత్రోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను సంస్కరించాలి



విద్యార్థులకు అవగాహనతో కూడిన విద్య అందించాలి. ఈ రోజుల్లో బట్టీ విధానంలో బోధిస్తున్నారు. దీంతో సరిగా అర్థం కాక పరీక్షల సమయంలో ఒత్తిడితో ఎంతోమంది బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్యావ్యవస్థను ప్రాథమిక స్థాయి నుంచి సంస్కరిస్తేనే విద్యారంగం అభివృద్ధి చెందుతుంది. – అరవింద

లింగ వివక్ష లేకుండా చూడాలి



ఆర్థిక ప్రగతి మాత్రమే దేశాభివృద్ధికి కొలమానం కాదు. దేశంలో మహిళలు సమానత్వాన్ని సాధించాలి. వారు స్వేచ్ఛగా ప్రతీ ఉద్యోగం చేయగలగాలి. ముఖ్యంగా లింగ వివక్ష లేని సమాజం ఆవిష్కృతం కావాలి. ఈ దిశగా ప్రభుత్వాలు చర్యలు చేపడితేనే అన్ని రంగాల్లో సమానత్వం సాధ్యమవుతుంది. – కే శినేష్

విలువలతో ప్రవర్తించాలి



భారత రాజ్యాంగం మనకు అందించిన స్వేచ్ఛ, స్వాతంత్య్రాలను దుర్వినియోగం చేయవద్దు. హక్కులు సాధించుకుంటూనే బాధ్యతాయుతంగా మెలగాలి. ప్రతిఒక్కరికీ వీలైనంత వరకు చేదోడువాదోడుగా ఉండాలి. దేశ స్వాతంత్య్ర స్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతిఒక్కరూ విలువలతో ప్రవర్తించాలి. – సార ఫిర్దోస్

అవినీతి అంతమొందాలి



ప్రభుత్వ కార్యకలాపాల్లో పారదర్శకత పెరగాలి. లంచాలు తీసుకునే అధికారులకు కఠిన శిక్షలు విధించాలి. అప్పుడే అక్రమాలకు అడ్డుకట్ట పడుతుంది. అన్ని ప్రభుత్వ శాఖల్లో అవినీతి అంతానికి చర్యలు చేపట్టాలి. ఇందుకు పౌరులు కూడా తమవంతు బాధ్యత నిర్వర్తించాలి. – జే సాయినాథ్

అభివృద్ధి చెందిన దేశంగా మారాలి



మన దేశం దశాబ్దాలుగా అభివృద్ధి చెందుతున్న దేశంగానే మిగిలిపోతోంది. అభివృద్ధి చెందిన దేశంగా మారాలంటే ప్రతిఒక్కరూ క్షేత్రస్థాయిలో శ్రమించాలి. ప్రభుత్వాలూ ప్రత్యేక ప్రణాళికతో కృషి చేయాలి. ప్రణాళికలు పకడ్బందీగా అమలు చేస్తే ఇండియా అభివృద్ధి చెందిన దేశంగా తప్పనిసరిగా మారుతుంది. – జీ శ్రీజ

శక్తివంతంగా తయారు కావాలి



ఎన్నో సంస్కృతి, సంప్రదాయాలున్నా మన ఐక్యతే దేశానికి పెద్దబలం. భిన్నాభిప్రాయాలున్నా సోదరభావంతో మెలుగుతున్నాం. ఏ దేశం బలప్రయోగం, బలవంతపు ఒత్తిడులు ఇండియాపై పడకుండా ప్రభుత్వం పటిష్ట విదేశాంగ విధానం అమలు చేయాలి. ప్రపంచ యవనికపై దేశం శక్తివంతంగా ఎదగాలి. – కూర ఐశ్వర్య

రవాణా సౌకర్యం మెరుగుపర్చాలి



రవాణా రంగం అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉంటుంది. రవాణా రంగం ఎంతగా ప్రగతి సాధిస్తే అంత ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డు, జల, వాయు మార్గాలపై కూడా దృష్టి కేంద్రీకరించాలి. వీటితో ఎగుమతులు, దిగుమతులు పెరిగి విదేశీ ద్రవ్యం పోగుపడుతుంది. ఈ దిశగా చర్యలు చేపట్టాలి. – పీ చైత్ర

ముందస్తు చర్యలు చేపట్టాలి

కైలాస్‌నగర్: భారీ వర్షాలు కురియనున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. గురువారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు. సహాయక చర్యల కోసం జిల్లాకు రూ.కోటి విడుదల చేసినట్లు తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సెలవులు రద్దు చేసి, సెలవుపై వెళ్లిన వారిని వెనక్కి రప్పించాలని సూచించారు. కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్, అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి, వివిధ శాఖల అధికారులున్నారు.

అత్యవసర సాయం అందించాలి

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాలో అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందనకు ఎస్డీఆర్ఎఫ్ బృందం సిద్ధంగా ఉండేందుకు 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. వనమహోత్సవంలో భాగంగా మండలంలోని యాపల్‌గూడలోగల రెండో పోలీస్ బెటాలియన్ ఆవరణలో 600 మామిడి మధుబన్ మొక్కలు నాటే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై బెటాలియన్ సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం బెటాలియన్ సిబ్బందితో కలిసి శిక్షణ పొందిన వంద మంది అత్యవసర సందర్భాల్లో ప్రజలకు సహాయం చేయడం కోసం ప్రత్యేకంగా శిక్షణ పొందిన డెమో తిలకించారు. అనంతరం రాపిడ్ యాక్షన్ ఫోర్స్ ద్వారా శాంతిభద్రతల పరిరక్షణ, ప్రభుత్వ ఆస్తుల రక్షణ తదితర అంశాలపై శిక్షణ పొందిన సిబ్బందిచే డెమో కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, బెటాలియన్ కమాండెంట్ నితిక పంత్, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్‌సింగ్ పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌రూరల్: మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ రాజర్షి షా, పక్కన అధికారులు

పట్టణం.. త్రివర్ణ శోభితం

- ఆదిలాబాద్‌లో భారీ తిరంగా ర్యాలీ
- తరలివచ్చిన విద్యార్థులు, యువత

ప్రపంచ దేశాలకు భారతదేశం నాయకత్వం వహించేలా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం పయనిస్తోందని తెలిపారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతానికి సూచికగా ప్రతీ గ్రామంలో తిరంగా ర్యాలీ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, నాయకులు వేదవ్యాస్, దినేశ్ మటోలియా, ముకుందరావు, మహేందర్, కృష్ణయాదవ్, మురళీధర్, ఆదిత్య ఖండేశ్కర్ తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌చౌక్‌లో మానవహారంగా విద్యార్థులు

'పంద్రాగస్టు'కు అంతా సిద్ధం



పరేడ్ మైదానాన్ని సిద్ధం చేస్తున్న సిబ్బంది



షబ్బీర్ అలీకి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పీ

కైలాస్‌నగర్: పంద్రాగస్టు వేడుకలకు జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానం ముస్తాబైంది. పోలీసుల కవాతు, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు వీలుగా మైదానాన్ని చదును చేసి రంగురంగుల ముగ్గులతో అందంగా తీర్చిదిద్దారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే ప్రాంతంతో పాటు ముఖ్య అతిథులు ఆసీనులయ్యే వేదికను సిద్ధం చేశారు. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, పుర ప్రముఖులు, ప్రభుత్వ శాఖల అధికారులు, జర్నలిస్టులు కూర్చునేందుకు వీలుగా ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని తెలియజేసేలా స్టాళ్లు ఏర్పాటు చేసేందుకు గాను శాఖల వారీగా టెంట్లు వేశారు. వేడుకలు తిలకించేందుకు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ శాఖల ప్రగతి తీరు తెన్నులను తెలిపే శకటాలను ప్రదర్శించనున్నారు. ఉదయం 9.30గంటలకు జరిగే వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. జాతీయ పతాకావిష్కరణ అనంతరం పోలీసుల నుంచి గౌరవవందనాన్ని స్వీకరిస్తారు. అనంతరం జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. పాఠశాలల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనల అనంతరం ఉత్తమ సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందజేస్తారు. ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే స్టాళ్లను తిలకించి వివిధ పథకాల కింద లబ్ధిదారులకు ఆస్తులు పంపిణీ చేయనున్నారు.

జిల్లాకు చేరుకున్న ముఖ్య అతిథి

పంద్రాగస్టు వేడుకల ముఖ్య అతిథి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు మహ్మద్ అలీ షబ్బీర్ గురువారం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. స్థానిక పెన్‌గంగా గెస్ట్ హౌస్‌కు రాగా కలెక్టర్ రాజర్షి షా, ఎస్పీ అఖిల్ మహాజన్ స్వాగతం పలికారు. అనంతరం పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు.

రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి


వాహనంలోనే మృతి చెందిన శ్రీధర్

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని ఉట్నూర్ వెళ్లే రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో డ్రైవర్ మృతి చెందినట్లు సీఐ బండారి రాజు, ఏఎస్సై రంగారావు తెలిపారు. జగిత్యాల జిల్లా మేడిపల్లికి చెందిన ఇంగ్వే శ్రీధర్ (24) ఓ ప్రముఖ దినపత్రిక ప్రతులను కరీంనగర్ నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి తరలించడానికి వ్యానులో బయలు దేరాడు. మండల కేంద్రానికి సమీపంలోకి రాగానే ఓ చెట్టును ఢీ కొట్టడంతో తీవ్రగాయాలై వాహనంలోనే మృతి చెందాడు. వ్యానులో అతనితో పాటు ఉన్న మరో యువకుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

మద్యానికి దూరం.. చారిగాం

అదో మారుమూల కుగ్రామం. ఆ గ్రామంలో అందరి జీవనాధారం వ్యవసాయమే. ప్రతీరోజు ఉదయాన్నే నిద్రలేచి ఆహ్లాదకరమైన వాతావరణంలో వ్యవసాయ పనుల్లో నిమగ్నమవుతారు. మహాత్మాగాంధీ సూచనలు నమ్మిన కాగజ్‌నగర్ మండలంలోని చారిగాం గ్రామస్తులు మద్యపాన నిషేధాన్ని పాటిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.



- మూడున్నర దశాబ్దాల క్రితం పెద్దల తీర్మానం
- ఇప్పటికీ కట్టుబాటు పాటిస్తున్న గ్రామం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో చారిగాం గ్రామం ఉంది. ఈ గ్రామంలో 234 మంది జనాభా, 112 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. వారంతా మద్యపాన నిషేధానికి కట్టుబడి ఉంటున్నారు. గ్రామంలో గుడుంబా తయారీ, బెల్టుషాపుల ఏర్పాటు చేయవద్దని మూడున్నర దశాబ్దాల క్రితమే పెద్దలు తీర్మానించారు. ఇప్పటికీ అవే ఆచారాలను పాటిస్తున్నారు. గ్రామంలో అన్నీ వ్యవసాయ కుటుంబాలే. ప్రధానంగా కూరగాయాలు సాగుచేసి పట్టణంలోని మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. 35 ఏళ్లుగా గ్రామస్తులు మద్యపాన నిషేధం పాటిస్తున్నారు. స్థానిక యువత బయట తాగినట్లు తెలిస్తే ఆంజనేయస్వామి ఆలయానికి తీసుకెళ్లి వారిచే మాలధారణ చేయిస్తున్నారు. ఆధ్యాత్మిక చింతనతో కలిగే లాభాలను వివరిస్తూ మరోసారి మద్యం జోలికి వెళ్లకుండా వారికి అవగాహన కల్పిస్తున్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉంటారు. ఎలాంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా మంచి నడవడికతో ఉంటున్నారు.

ఆచారం ఇప్పటికీ కొనసాగుతోంది



మా తాతల కాలం నుంచి గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. అదే ఆచారం ఇప్పటి వరకూ కొనసాగుతోంది. గ్రా మంలో అందరం కలిసి మెలిసి ఉంటాం. ఏ సమస్య వచ్చినా ఇక్కడే అందరం కలిసి ప రిష్కరించుకుంటాం. ఆంజనేయ స్వామి గు డిలో పూజలు నిర్వహిస్తాం. అందరం కలిసి పండుగలు ఆనందంగా జరుపుకుంటాం. – మొర్ల పోచయ్య, చారిగాం

స్నేహభావంతో ఉంటాం



గ్రామంలోని యువకులమంతా కలిసి మెలిసి స్నేహభావంతో ఉంటా ం. గ్రామంలో ఏమైనా సమస్య ఉంటే యువకులమంతా ఒకేచోట చేరి పరిష్కరించుకుంటాం. గ్రామంలో ఎవరూ మద్యం సేవించరు. బెల్టుషాపులు పెట్టరు. ఇదే ఆచారాన్ని అందరం పాటిస్తాం.

– మొర్ల శంకర్, చారిగాం

సొసైటీ పాలకవర్గాల గడువు పొడిగింపు

- ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం


సీఎంను సన్మానిస్తున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు(పీఏసీఎస్)ల పాలకవర్గాల గడువును రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. గురువారంతో వీటి కాల పరిమితి ముగియగా మరో ఆరు నెలల పాటు సొసైటీ, డీసీసీబీ చైర్మన్ల పదవీకాలం పొడిగిస్తూ రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖల ప్రభుత్వ కార్యదర్శి ఎం.రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై సొసైటీ చైర్మన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డీసీసీబీ) చైర్మన్ అడ్డి భోజారెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డిని హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సచివాలయంలో ఆయనను కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

అధిక తేమ పంటలకు చేటు


కోటపల్లి మండలంలో పత్తి చేనులో నిలిచిన వర్షపు నీరు

- తక్షణమే జాగ్రత్తలు పాటిస్తే మేలు
- బానోతు ప్రసాద్, ఏడీఏ, చెన్నూర్

చెన్నూర్‌రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు పంటచేలల్లో నీరు నిలిచింది. నీరు ఎక్కువైతే తేమ ఏర్పడి పంటలకు నష్టం వాటిల్లనుంది. అధిక తేమతో పంటలు నష్టపోకుండా ఉండాలంటే తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెన్నూర్ ఏడీఏ బానోతు ప్రసా ద్ సూచిస్తున్నారు. వివరాలు ఆయన మాటల్లోనే... వర్షాలకు పత్తి చేనులో నీరు నిలిస్తే వెంటనే కాలువలు తీసి నీటిని బయటకు పంపించాలి. వర్షాలు తగ్గిన వెంటనే భూమిలో తేమను తగ్గించు కోవడానికి అంతర సేద్యం చేయాలి. బురద పదనులో ఎకరాకు 25 కిలోల యూరియా 10 కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. అలాగే ఎకరానికి సీ ఓసీ 3 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఒకరోజు తర్వాత కిలో స్వర్ణపాల్‌ను 150 లీటర్ల నీటికి కలిపి ఎకరానికి పిచికారీ చేయాలి. పంటను వేరుకుళ్లు తెగులు ఆశిస్తే 3 గ్రాముల ఆక్సిక్లోరైడ్ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ను లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

మొక్కజొన్న

అధిక తేమను తట్టుకోలేదు. సాధ్యమైనంత త్వరగా అంతరకృషి చేసుకోవాలి. ఎకరాకు 25 కిలోల యూ రియా, 10 కిలోల పొటాష్ ఎరువును మొక్కల మొదళ్ల దగ్గర వేసుకోవాలి. కాండం తొలిచే పురుగు ఉంటే కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు ఎకరానికి 3 కిలోలు ఆకు సుడుల్లో వేయాలి. పెసర, మినుము పైర్లకు అధిక తేమతో పేనుబంక, లద్దె పురుగు ఆశించే అవకాశం ఉంది. ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీలీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మిరప పంట

మిరప చేనులో నీరు నిలిస్తే వెంటనే నీటిని కాలు వల ద్వారా తొలగించాలి. నారుకుళ్లు తెగులు ఆశిస్తే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. 3 గ్రాముల కాపర్ ఆక్సిక్లోరైడ్ లేదా రెండు గ్రాముల రిడోమిల్ లీటరు నీటికి కలిపి వారంలో రెండు నుంచి మూడుసార్లు పిచికారీ చేయాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే అధిక తేమ నుంచి పంటలను కాపాడుకోవచ్చు.

స్వచ్ఛతలో మేటి ‘దేవునిగూడ’


దేవునిగూడ గ్రామ పంచాయతీ కార్యాలయం

- రెండుసార్లు ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపిక
- కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు స్వీకరణ

జన్నారం: దేశానికి పల్లెలే పట్టుకొమ్మలని, గ్రామాలు పచ్చదనంతో ఉంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని చెబుతారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతే ధ్యేయంగా ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఇందులో భాగంగా పరిశుభ్రం, పచ్చదనంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంలో ముందుండడమే కాకుండా ఉత్తమ గ్రామ పంచాయతీగా రెండుసార్లు ఎంపికై ంది. సర్పంచ్, కార్యదర్శులు కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. అదే జన్నారం మండలంలోని దేవునిగూడ.

పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

దేవునిగూడ గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ గుర్రం శిరీష, కార్యదర్శి సరిత ప్రభుత్వ కార్యక్రమాలు అమలు చేయడంతో పాటుగా హరితహారం, పరిశుభ్రత కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించారు. డ్రెయినేజీలు శుభ్రం చేయించడం, మురుగు నీరు రోడ్లపై పారకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. రోడ్లుకు ఇరువైపులా మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టారు. పల్లె ప్రకృతి వనం, శ్మశాన వాటిక, డంపింగ్ యార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచారు. పలుమార్లు ఈ గ్రామాన్ని సందర్శించిన ఉన్నతాధికారులు పంచాయతీ పాలకవర్గం పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ఇందులో భాగంగా 2022 ఆగస్టు 15న అప్పటి సర్పంచ్ శిరీష, కార్యదర్శి సరిత కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకున్నారు.

శిశువు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి


ధర్నా చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

బెల్లంపల్లి: వైద్యుల నిర్లక్ష్యంతోనే శిశువు మృతి చెందాడని ఆరోపిస్తూ గురువారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఎదుట బాధిత కుటుంబ సభ్యులు ధర్నా నిర్వహించారు. బాధితులు తెలిపిన వివరాల మేరకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలానికి చెందిన గర్భిణి సువర్ణకు పురిటి నొప్పులు రావడంతో ఆమె భర్త కరణ్ బుధవారం బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చాడు. పరీక్షించిన వైద్యులు నార్మల్ డెలివరీ చేస్తామని చెప్పి చేర్చుకున్నారు. అదే రోజురాత్రి మగశిశువుకు జన్మనిచ్చింది. పుట్టిన బిడ్డ చనిపోయినట్లు తెలుసుకున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శిశువు మృతి చెందాడని ఆస్పత్రి ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. మంచిర్యాలకు రెఫర్ చేయకుండా వైద్యులు అశ్రద్ధ చేసి తమ బిడ్డ మృతి చెందడానికి కారకులయ్యారని ఆరోపించారు. ఈ ఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై ఆస్పత్రి వైద్యులను వివరణ కోరగా మగశిశువు స్టిల్‌బర్త్‌తో పుట్టాడని, తల్లిగర్భంలో ఉన్నప్పుడు మలం తినడంతో మృతి చెందినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ముల్కల్ల గ్రామ శివారులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. హాజీపూర్ ఎస్సై స్వరూప్‌రాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కోటపల్లి మండలం దేవులవాడకు చెందిన నిట్టూరి శశిపాల్ (36) గురువారం ఉదయం ముల్కల్ల శివారులో నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం అతివేగంగా వచ్చి ఢీ కొట్టడంతో త్రీవగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించడంతో మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి రాత్రి మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. మృతుని తండ్రి లస్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సురేఖ


ఎరువుల కోసం బారులు తీరిన రైతులు

యురియా కోసం రైతుల ఆందోళన

భీమిని: యూరియా సక్రమంగా పంపిణీ చేయ డం లేదని మండలంలోని వెంకటపూర్‌లో జై భీమ్ పరస్పర సహాయక సహకార మార్కెటింగ్ సంఘం ఎదుట రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. రైతులు మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి ఇప్పటివరకు ఒక లోడు మాత్రమే పంపిణీ చేశారని తెలిపారు. నిర్వాహకులు బ్లాక్ మార్కెట్‌లో అమ్ముతూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఏడీఏ సురేఖ, ఎస్సై భాస్కర్‌రావు రైతులతో మాట్లాడగా ఆందోళన విరమించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే అమ్మకాలు చేపట్టాలని, లేనిపక్షంలో చర్యలు తీసుకుంటామని ఏడీఏ సురేఖ తెలిపారు.

ఎరువుల కోసం బారులు

చెన్నూర్: చెన్నూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ భవనం వద్ద ఎరువుల కోసం రైతులు బారులు తీరారు. గురువారం ఎరువులు పంపిణీ చేస్తున్నారనే సమాచారం మేరకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వరుసలో ఎక్కువ సమయం ఉండలేక తమ వంతుగా చెప్పులు ఉంచారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని రైతులకు సక్రమంగా ఎరువులు పంపిణీ జరిగేందుకు బందోబస్తు నిర్వహించారు.

నేడు బెల్లంపల్లిలో ఉమ్మడి జిల్లా మహాసభ

బెల్లంపల్లి: తెలంగాణ హమాలీ వర్కర్స్ యూని యన్ (టీహెచ్‌డబ్ల్యూ) ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహాసభను శుక్రవారం బెల్లంపల్లిలోని అగర్వాల్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గెల్లి రాజలింగు తెలిపారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటి సామ్రాజ్యం ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు. 21 విభాగాల్లో పని చేస్తున్న హమాలీలు పాల్గొంటారని, సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ తయారు చేయనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

సాత్నాల: పెన్‌గంగ పరీవాహక ప్రాంతమైన కొత గ్రామంలో గురువారం గుర్తు తెలియని మహిళా మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై గౌతమ్ పవర్ తెలిపారు. మృతురాలికి 45 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందన్నారు. ఘటన స్థలం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు వెల్లడించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించినట్టు తెలిపారు.

ఇళ్లపై త్రివర్ణ పతాకం ఆవిష్కరించాలి

చెన్నూర్: ప్రతి ఒక్కరూ ఇళ్లపై త్రివర్ణ పతాకాలను ఆవిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. హర్ ఘర్ తిరంగలో భాగంగా గురువారం చెన్నూర్ పట్టణంలోని జలాల్ పెట్రోల్ బంక్ నుంచి ప్రధాన వీధుల్లో జాతీయ పతాకాలతో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో ఆపరేషన్ సింధూర్ విజయవంతమైందని తెలిపారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బత్తుల సమ్మయ్య, కేవీఎం శ్రీనివాస్, తిరంగా ర్యాలీ కన్వీనర్ శివకృష్ణ, మంత్రి రామయ్య పాల్గొన్నారు.





స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నటి పూర్ణ, హీరో శివ కందుకూరి పంచుకున్న విశేషాలు

ఒక్కొక్కరం ఒక్కో రంగు - పూర్ణ

● స్కూల్ డేస్‌లో ఇండిపెండెన్స్ డే ప్రోగ్రామ్స్‌లో పాల్గొనేదాన్ని. దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ఓ మంచి గుర్తుగా మిగిలిపోయింది. ఇప్పుడు కూడా నా స్కూల్ డేస్‌ని గుర్తు చేసుకుంటున్నాను. దానికి కారణం దుబాయ్‌లో నేను ఆరంభించిన 'డ్యాన్స్ స్కూల్'. ఈ స్కూల్ స్టార్ట్ చేశాక వచ్చిన తొలి ఇండిపెండెన్స్ డే ఇది. ఈ సందర్భంగా మా స్కూల్ స్టూడెంట్స్‌తో దేశభక్తికి సంబంధించిన రీల్ చేయించాం. సోషల్ మీడియా ద్వారా ఇవాళ రిలీజ్ చేయనున్నాం. రిపబ్లిక్ డే అప్పుడు ఇలాంటిదే చేశాం. అప్పుడు నేను కూడా పాల్గొన్నాను. ఈసారి షూటింగ్స్ ఉండటంతో హైదరాబాద్‌లో ఉన్నాను.

● స్కూల్లో 'ఏ మేరా ఇండియా' అని డ్యాన్స్ చేస్తున్నప్పుడు ఒళ్లు పులకరించిపోయేది. ఇప్పటికీ ఆ పాట పాడుతుంటే ఓ రకమైన ఎమోషన్ కలుగుతుంది. నేను ఫార్మల్‌గా డ్యాన్స్ నేర్చుకున్నాను. అందుకే దేశం పట్ల నాకు ఉన్న భక్తిని దేశభక్తి పాటలకు డ్యాన్స్ చేయడం ద్వారా వ్యక్తపరుస్తుంటాను. అసలు 'ఇండియా' అని పలుకుతుంటేనే ఎంతో బాగుంటుంది.

● చిన్నప్పుడు స్కూల్ ప్రోగ్రామ్స్‌లో పార్టిసిపేట్ చేసినప్పుడు బాగా పర్ఫార్మ్ చేయాలనే దాని మీదే ఎక్కువ ఫోకస్ ఉండేది. అలాగే జెండా రంగులు వచ్చేలా ఒక్కొక్కరం ఒక్కో రంగు డ్రెస్ వేసుకోవడం అనేది ఓ తీపి గుర్తు. తర్వాత తర్వాత మనకు ఇండిపెండెన్స్ రావడానికి ఎందరి త్యాగం ఉందో తెలుసుకుని, వాళ్లందరి మీద గౌరవం పెరిగింది. అలాగే మనం ఇక్కడ క్షేమంగా ఉంటున్నామంటే సరిహద్దుల్లో ఉంటున్న సైనికుల వల్లే. అందుకే ఈ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 'సైనికా... సెల్యూట్' అంటున్నాను.

● సైనికుల త్యాగాల గురించి చెబుతుంటే నాకు యాంకర్ రష్మీ గుర్తొస్తున్నారు. ఆమె సోదరుడు ఆర్మీలో ఉన్నారు. యుద్ధం జరిగినప్పుడు అక్కడ ఉన్న తన సోదరుడి గురించి ఇక్కడ వీరి కుటుంబం ఫీలింగ్స్‌ని స్వయంగా చూశాను. సోల్జర్స్ కుటుంబాలు పడే ఆవేదన, దేశ రక్షణలో తమ కుటుంబం నుంచి ఒక వ్యక్తి ఉన్నారనే ఆనందం... ఇలా రెండు ఫీలింగ్స్ కనబడుతుంటాయి.

● భవిష్యత్తులో మన పిల్లలు ఏ ఉద్యోగంలో స్థిరపడతారో చెప్పలేం. కానీ మా అబ్బాయితో మాత్రం 'నిన్ను ఆర్మీలో చేర్పిస్తా' అంటుంటాను. ఎందుకంటే వాడికి ఏ బొమ్మలూ నచ్చవు. అవి ఎంత పెద్దవైనా. వాటి పక్కన చిన్న గన్ ఉంటే చాలు... దాంతోనే ఆడుకుంటాడు. ఎక్కువగా అవే కొనుక్కుంటాడు. అందుకే మా అబ్బాయిలో నాకో సోల్జర్ కనబడుతుంటాడు.

అప్పుడు నేను నెహ్రూ - శివ కందుకూరి

● స్వాతంత్ర్య దినోత్సవం రోజున తప్పనిసరిగా స్కూల్‌కి హాజరవ్వాలనే నియమం ఉంటుంది. రూల్ ఉందని కాదు... ఇష్టంగా వెళ్లేవాణ్ణి. ఆ రోజు జరిగే కార్యక్రమాల్లో పాల్గొనడం ఎప్పుడూ గుర్తుండిపోయే చిన్ననాటి జ్ఞాపకం. జెండా ఎగరేస్తుంటే సెల్యూట్ చేస్తూ, చూడటం నాకు చాలా హ్యాపీగా ఉండేది. అందుకే మిస్ కాకుండా స్కూల్‌కి వెళ్లేవాణ్ణి. నా చిన్నప్పుడు స్కూల్లో ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్ కోసం నెహ్రూజీలా డ్రెసప్ అయ్యాను. అలా రెడీ అయి, వెళ్లడం నాకు గుర్తుంది. అప్పుడు దేశభక్తి పూర్తి అర్థం తెలియదు. అయితే ఇప్పుడు ఒక హీరోగా ఏదైనా ఫ్రీడమ్ ఫైటర్ రోల్ చేసే అవకాశం వస్తే... తప్పకుండా చేయాలని ఉంది. ఎందరికో స్ఫూర్తిగా నిలిచిన పోరాట యోధుల గురించి మరోసారి గుర్తు చేసే అవకాశం ఉంటుంది కదా.

● మామూలుగా మనం చదువుకుంటున్నప్పుడు దేశ, విదేశీయులు కూడా ఆ ఇన్‌స్టిట్యూషన్స్‌లో చేరుతుంటారు. అలా నేను అమెరికాలో చదువుకున్న యూనివర్సిటీలో పలు దేశాలవారిని కలిశాను. వాళ్ల దేశాల్లో ఉండే నియమ నిబంధనలు విన్నప్పుడు 'నా దేశం ఎంతో మెరుగ్గా ఉంది కదా' అనిపించింది. ఒక ఫ్రీ కంట్రీలో బతుకుతున్నప్పుడు ఆ దేశానికి మనం విలువ ఇవ్వాలి. ఆ దేశం గురించి మనం గర్వపడాలి. ముఖ్యంగా ఆడవాళ్ల విషయంలో కొన్ని దేశాల్లో హద్దులు హారిబుల్. అమ్మాయిలు బయటకు వెళ్లకూడదు... డ్రైవ్ చేయకూడదు వంటి నియమాలు చూసి, మగవాళ్ల ఆధిపత్య పోరు ఎంతలా ఉందీ అనిపించింది. అఫ్‌కోర్స్ ఇప్పుడు ఆ నియమాల్లో కాస్త వెసులుబాటు వచ్చిందనుకోండి.

● నేను యూఎస్‌లో ఓ పదేళ్ల పాటు ఉన్నాను. ట్రాన్సిల్‌వేనియాలో ఉన్న 'ఇండియన్ అసోసియేషన్' వారు 2013లో ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ ఆరంభించారు. ఆ వేడుకల్లో రెండుసార్లు జెండా ఎగరేసే అదృష్టం నాకు దక్కింది. విదేశీ గడ్డ మీద మన మాతృదేశం జెండా ఎగరేయడం అనే ఫీలింగ్ మాటలకు అందనిది. పైగా మన భారతీయులు విదేశీ గడ్డపై ఐకమత్యంతో స్వాతంత్ర్య దినోత్సవం జరుపుకోవడం అనేది నాకు బాగా అనిపించింది. నా మూలాల మీద నాకు మరింత ప్రేమ పెరిగేలా చేసింది.

స్వాతంత్ర్యదినోత్సవ థీమ్... నయా భారత్

థీమ్ అనేది అలంకారప్రాయం కాదు. మన భవిష్యత్ లక్ష్యాల గురించి బలంగా చెప్పే... సంక్షిప్త సందేశం. ఎప్పటికప్పుడు కొత్తగా ఆలోచిస్తూ, కొత్త శక్తులతో ముందడుగు వేసినప్పుడే కొత్త భారతాన్ని ఆవిష్కరించుకోగలుగుతాము. ఈ భావాన్ని ప్రతిబింబించేలా 'నయా భారత్' అని ఈ స్వాతంత్ర్య దినోత్సవం థీమ్‌ను నిర్ణయించారు.



డాలీగారి దేశభక్తి

'దేశభక్తి మీకేనా? నాకు కూడా ఉంది' అని చెప్పకనే చెప్పింది డాలీ. పెయింటర్ డాగ్‌గా పాపులర్ అయిన డాలీకి ఎంతో మంది అభిమానులు ఉన్నారు. తాజాగా త్రివర్ణ పతాకం పెయింట్ వేసి 'ఆహా' అనిపించేలా చేసింది డాలీ. 'శునక రాజమా... నీ దేశభక్తికి జోహార్లు' అంటున్నారు నెటిజనులు.



తండ్రి పేరు వందేమాతరం..!

'పేరులో పవర్ ఉంటుంది' అంటారు. కొన్ని పేర్లు వింటే 'నిజమే!' అనిపిస్తుంది. ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందిన ఈ కుటుంబసభ్యుల పేర్లలో దేశభక్తి ధ్వనిస్తుంది. తండ్రి పేరు వందేమాతరం ప్రహ్లాద్ నాయక్. కుమారుడి పేరు తిరంగా ప్రియదర్శన్. కూతురు పేరు జైహింద్ జగ్యన్ సేని. 'మతాన్ని ప్రతిఫలించే పేర్లు కాకుండా దేశభక్తిని ప్రతిఫలించే పేర్లు అంటే నాకు ఇష్టం' అంటున్న వందేమాతరం స్వచ్ఛందసేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటాడు. వందేమాతరం ఇంటిలోని గదులు జాతీయజెండాలోని మూడు రంగులతో అలంకరించి ఉంటాయి.

ఈ అమెరికన్ మన జాతీయగీతం అద్భుతంగా ఆలపిస్తాడు!

పదిహేడు సంవత్సరాల అమెరికన్ గేబ్ మెరిట్ ఆలపించిన మన జాతీయగీతం 'జన గణ మన' సోషల్ మీడియాలో వైరల్ అయింది. 'ఓ మై గాడ్... నా హృదయం దేశభక్తితో ఉప్పొంగిపోయింది' అనే కాప్షన్‌తో ఈ వీడియోను షేర్ చేసింది దిశ అనే నెటిజన్. 'ఎన్నో దేశాల జాతీయగీతాలు పాడినప్పటికీ గేబ్‌కు మన జాతీయగీతం ఆలపించడం అంటే ప్రత్యేక అభిమానం' అని రాసింది దిశ.



అంటార్కిటికాలో వందేమాతరం





అంటార్కిటికాలోని పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న భారతీయ ఉద్యోగులు ఆగస్ట్ పదిహేను పర్వదినాన్ని పురస్కరించుకొని జాతీయజెండా ఎగరేయడానికి సన్నద్ధం అవుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వాతావరణ ప్రతికూలతలు ఉన్నప్పటికీ 'మేము సైతం' అంటూ జాతీయపతాకావిష్కరణకు సన్నద్ధం అవుతున్న దృశ్యం నెటిజనులను ఆకట్టుకుంది. ఉద్యోగులు మంచుపెకిలిస్తుంటే, నేపథ్యంలో 'వందేమాతర గీతం' వినిపిస్తుంటుంది.


● 50 ఏళ్ల షోలే (1975-2025)

షోలే... అప్పుడది తుపాన్ ఇండియా

సినిమా మొత్తం రెండు జతలకు మించి వాడని హీరోలు... హీరోయిన్ ఏమో టాంగేవాలీ... ఇంకో హీరోయిన్ వితంతువు... ముఖ్య క్యారెక్టర్ ఆర్టిస్టుకు రెండు చేతులూ ఉండవు... విలన్‌కు గట్టిగా చూస్తే 20 మందికి మించి గ్యాంగ్ లేదు... లొకేషన్ ఉత్త రాళ్లదిబ్బలు... ఇవాళ్టి పాన్ ఇండియా సినిమాలతో పోల్చి చూస్తే ఈ లక్షణాలతో ఏదైనా సినిమా సూపర్ హిట్ అవుతుందా? అవుతుంది... అయ్యింది... అవుతూనే ఉంది... 'షోలే' - ఒక ప్రెజెంట్ కంటిన్యుయెస్ టెన్స్ 50 ఏళ్లుగా 'షోలే' లిఖించిన రికార్డులు ఎన్నో. చెప్పిన కొటేషన్లు మరెన్నో. 'జో డర్ గయా... సమ్‌ఝో మర్‌గయా'... మరణమే లేని షోలేతో ప్రేక్షకుల వీడని దోస్తీ గురించి ప్రత్యేక కథనం...







'పుష్ప' సినిమా రెండు పార్ట్‌లుగా వచ్చి కోట్లు సంపాదించింది.

ఒక గంధపు చెక్కల స్మగ్లర్ హీరోనా అని ఒకరిద్దరు క్వశ్చన్ చేశారు.

కాని సగటు జనం జానేదో అని సూపర్‌హిట్ చేశారు.

ఈ సగటు జనం ఇక్కడి వరకూ చేయడానికి చాలా మెట్లు పడ్డాయి.

వాటిలో 'షోలే' ఒకటి.

***

సలీమ్-జావేద్ హిందీలో యాంగ్రీ యంగ్‌మేన్‌ను తెచ్చారు. అంటే స్వాతంత్ర్యం వచ్చాక జన్మించి, యుక్త వయసు వచ్చేనాటికి అంటే 1970ల నాటికి దేశ స్థితి చూస్తే ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, బ్లాక్ మార్కెట్. రోజులు ఇలా ఉంటే అమ్మాయి వెంట పరిగెత్తి విరహగీతాలు పాడే హీరో చెల్లుబాటు కాడు అని వాళ్లు కోపంగా ఉండే హీరోని తెచ్చారు. 'జంజీర్'లో అమితాబ్ అలాంటి హీరో. ఇతను ఇన్‌స్పెక్టర్‌గా ఉంటూ కూడా తన తల్లితండ్రులను చంపిన వాణ్ణి చట్టప్రకారం శిక్షించలేకపోతాడు. యూనిఫామ్‌ను వదిలాకే పగ సాధిస్తాడు. చట్టానికి ఆవల కొన్ని పనులు చేసే హీరోలు అలా పుట్టుకొచ్చారు. ఆ తర్వాత 'దీవార్' వచ్చింది. కష్టపడి పని చేసే హీరోకు బదులు అడ్డదారిలో స్మగ్లర్‌గా మారే హీరోగా కనిపిస్తాడు అమితాబ్. సినిమాలో నిజాయతీపరుడైన శశికపూర్ ఉన్నా అందలానికి ఎదిగిన అమితాబ్‌ను ఆరాధిస్తాడు ప్రేక్షకుడు. ఈ వరుసలోనే వచ్చింది 'షోలే'. ఇక్కడ అత్యంత దుర్మార్గుడైన గబ్బర్ సింగ్‌ను సంహరించడానికి ఇద్దరు చిల్లర దొంగలను కాంట్రాక్ట్ మీద పట్టుకొస్తాడు ఊరి పెద్ద ఠాకూర్. చిల్లర దొంగల్లో వీరత్వం ఉండటం, కొంచెం మానవత్వం ఉండటంతో మేలు చేయని పోలీసుల కంటే కొద్దిగా కీడు చేసే చిల్లర దొంగలే నయం అనుకుంటారు రామ్‌గఢ్ వాసులు, తద్వారా ప్రేక్షకులు. ఆ విధంగా సకల సద్గుణ శోభితుడైన హీరోకు నూకలు చెల్లుతూ వచ్చి 'పుష్ప' వరకూ అతడు రూపాంతరం చెందాడు.

***

'షోలే' కథ అంతా రెండు లైన్లలో చెప్పొచ్చు. గొప్ప కథలు ఏవంటే కట్టె కొట్టె తెచ్చె అన్నట్టుగా చెప్పగలిగేవే. పోలీస్ ఆఫీసర్ ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ సింగ్ చంపేశాడు. ఆ ప్రాంతానికి పీడగా మారాడు. వాణ్ణి చంపడానికి ఠాకూర్ ఇద్దరు దొంగలను కిరాయికి తెచ్చాడు. అంతే కథ. ఈ కథను మూడున్నర గంటల పాటు 70 ఎం.ఎం స్క్రీన్ మీద దర్శకుడు, నటీనటులు, రచయితలు, కెమెరామేన్, సంగీత దర్శకుడు ఎలా చూపారనేదే అసలు సంగతి. వాళ్లు ఎలా చూపారంటే అలా మరెవరూ, మరెప్పుడూ చూపలేకపోయారు. అందుకే షోలే అంటే షోలే. ఇలాంటి సినిమాలు సర్పాల తలలపై మణుల వంటివి. రీమేక్‌లని ప్రయత్నిస్తే మణులు రాళ్లయిపోతాయి. లేదా పాము కాటు తప్పదు. అందుకే 'షోలే'ను మళ్లీ మళ్లీ ముస్తాబు చేసి వదిలారు తప్ప రీమేక్ అంటే జనం తుపాకులు తీశారు.

***

'షోలే' యాక్షన్ సినిమా అనుకుంటారు. ఫక్తు కుటుంబ కథా చిత్రం. కుటుంబమే దీనికి ఆధారం. ఠాకూర్ కుటుంబాన్ని గబ్బర్ గాడు కాల్చి చంపాడు. కుటుంబం కోల్పోతే మనిషికి ఉండే బాధతో ప్రేక్షకుడు ఐడెంటిఫై అవుతాడు. ఆ రోజుల్లో మగవారి ఎర్లీ డెత్స్ వల్ల ప్రతి ఇంటా ఒక వితంతువు ఉండేది. జయభాదురి వేసిన రాధ పాత్రను ప్రేక్షకులు పోల్చుకున్నారు. భర్త పోయిన ఎన్నో ఏళ్లకు ఆమె 'జయ్' అనే అమితాబ్‌ను చూసి మళ్లీ అతనితో కుటుంబాన్ని నిర్మించుకోవచ్చేమో అని ఆశ పడుతుంది. ఆ ఆశ ప్రేక్షకులకు తెలుసు. ఆమెకో కుటుంబం ఏర్పడాలని వారూ అనుకుంటారు. జరగదు. జయ్ చనిపోతాడు. ప్రేక్షకులు అక్కడా కనెక్ట్ అవుతారు. ఏ తాడూ బొంగరం లేని వీరూ అను ధర్మేంద్ర టాంగేవాలీతో సరసం చేసి సాధించుకుంది మౌసీతో పాటు ఒక కుటుంబాన్నే కదా! ఇక కథలో ఇమామ్ గారి కుటుంబానికి వచ్చిన బాధ ఎవరు మరుస్తారు. చేతికి ఎదిగొచ్చిన కొడుకు పట్నం పోయి సంపాదిస్తాడనుకుంటే తండ్రిని ఏకాకిని చేసి గబ్బర్ చేతుల్లో ప్రాణాలు కోల్పోతాడు. కుటుంబం ఉనికే భారతదేశ సమాజపు ఉనికి. ఇన్ని కుటుంబాల ఉద్వేగాల అల్లిక కాబట్టే 'షోలే' ఆడింది. ఆడుకుంది.

***

'షోలే' ప్రివ్యూ కోసం థియేటర్‌లో కూచున్న రాజ్‌కపూర్ సినిమా మొదలైన పది నిమిషాల్లోనే మొదలయ్యే ట్రైన్ రాబరీ సీక్వెన్స్ చూసి చకితుడయ్యాడు. 'ఇదేంటి... క్లయిమాక్స్‌ను ముందే పెట్టేశారు' అన్నాడట పక్కనున్న వారితో. అవును 'షోలే' క్లయిమాక్స్ ముందే వచ్చేస్తుంది... అంత భారీగా. ఆ తర్వాత 'షోలే'ను కేవలం సన్నివేశాల బలం మీద నడుపుతారుగాని యాక్షన్ మీద కాదు. 'షోలే' క్లయిమాక్స్ కేవలం ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మీదే! చేతుల్లేని ఠాకూర్ చేతులు తెగ్గొట్టే గబ్బర్‌తో తలపడతాడు. ఇలా స్క్రీన్‌ప్లే రాసిన 'షోలే' ఆడిందంటే ఏమిటి మర్మం! అదేమిటో ఎవరూ చెప్పలేరు. చెప్పినా కొంతే. రొంతే. అంతంతే. షోలేకు వ్యాఖ్యానం లేదు.

***

1973లో మొదలెట్టి రెండేళ్ల పాటు తీశారు 'షోలే'. కార్పెట్లు అమ్మి, ఆ తర్వాత రియల్ ఎస్టేట్ చేసి సంపాదించిన డబ్బును కొడుక్కు ఇచ్చి సినిమా చేయమన్నాడు నిర్మాత జి.పి.సిప్పీ. కోటి రూపాయల సినిమా! వస్తే చాలా డబ్బులు రావాలి పోతే కోటి అన్నాడు. అందుకు తగ్గ కథ రమేష్ సిప్పీ రాయించుకున్నాడు సలీమ్ జావేద్‌లతో! అతని వేడి చూసి - వాళ్లు కూడా రంగంలో దిగారు. 'లోహా గరమ్ హై... మార్ దో హథోడా' (ఇనుము వేడి మీద ఉన్నప్పుడే సమ్మెట పోటు పడాలి) అనుకున్నారు. ఠాకూర్, గబ్బర్ సింగ్‌ల మధ్య ఇద్దరు దొంగలను ప్రవేశపెట్టి కథ అల్లారు. దీనికి ప్రేరణ అకిరా కురసావా 'సెవన్ సమురాయ్', మనం తీసిన 'మేరా గావ్ మేరా దేశ్'... ఇంకొన్ని సినిమాలు ఉన్నాయి. అన్నీ తీసుకుని మనది ఇవ్వడం కూడా విద్యే. ఆ విద్యతో తయారైన ఈ కథకు ద్వారకా దివేచా కెమెరా, రామ్ యెదేకర్ ఆర్ట్ డైరెక్షన్, ఎం.ఎస్.షిండే ఎడిటింగ్, ఆర్.డి.బర్మన్ సంగీతం... గంధపు చేతులకు మల్లెలు చుట్టాయి. మరి రమేష్ సిప్పీ ఇంత మంచి టేకింగ్‌ను ఎలా సాధించాడో అతనికే తెలియాలి. ధర్మేంద్ర, అమితాబ్, అంజాద్ ఖాన్, సంజీవ్ కుమార్, హేమమాలిని, జయభాదురి... ఎవరికి ఎవరు తక్కువ. సత్తువ చూపడం వారికి మక్కువ.

***

'షోలే'లో ప్రతి సన్నివేశానికి, ప్రతి ఫ్రేమ్‌కు అభిమానులున్నారు. అందులోని ప్రతి చిన్న పాత్రకూ అభిమానులున్నారు. జైల్లో గూఢచారిగా పని చేసే బార్బర్ హరిరామ్, పిరిమిగా కట్టెలు అమ్మే సూర్మా భూపాలి, నమక్ తినే కాలియా, గబ్బర్‌కు బదులు పలికే సాంబా, హిట్లర్ జైలర్, ఠాకూర్ నమ్మినబంటు రామ్‌లాల్, పిల్లనిచ్చేందుకు ధర్మేంద్ర గుణగణాలు ఆరాతీసే మౌసీ, 'మెహబూబా' పాటలో మెరిసిన జలాల్ ఆగా... ప్రతి ఒక్కరూ... సినిమాను ధన్యం చేశారు... ధన్యులయ్యారు. ప్రేమ నాటకం కోసం వాటర్ ట్యాంకర్ ఎక్కిన ధర్మేంద్ర 'చక్కీ పీసింగ్' (తిరగలి తిప్పింగ్) అంటాడు. ప్రేక్షకులు నవ్వుతారు. 'సూసైడ్' అంటే ఆత్మహత్య అని ధర్మేంద్ర వల్లే జనానికి ఇంగ్లిష్‌లో తెలిసింది.

> పంచ్ డైలాగ్స్ ఫలానా దర్శకుడు వచ్చాక, ఫలానా రచయిత వచ్చాక ట్రెండ్‌లోకి వచ్చాయి అని ఎవరైనా అంటే నోటితోనే నవ్వబుద్ధవుతుంది. సకల పంచ్ డైలాగ్‌లకు బాప్ 'షోలే'. అందులో ప్రతి మాటా ఒక పంచ్ డైలాగే. పైగా అవి నిత్య జీవితంలోకి వచ్చేసిన డైలాగులు. కొటేషన్‌లు. సూక్తులు.
>
> - ఇజ్జత్ కీ మౌత్ జిల్లత్ కీ జిందగీ సే కయీ అచ్ఛీ హై (పరాభవాలతో బతికే కన్నా పరువుతో చావడం మేలు)
> - ముఝేతో సబ్ పోలీస్ వాలోంకీ సూరతే ఏక్ జైసీ లగ్ తీ హై (నాకు అందరు పోలీసోళ్ల ముఖం ఒకలాగే కనిపిస్తుంది)
> - తేరా క్యా హోగా కాలియా (నీ గతేంది కాలియా)
> - తుమ్హారా నామ్ క్యా హై బసంతి? (నీ పేరేంటి బసంతి)
> - దామ్ జో తుమ్ చాహో... ఔర్ కామ్ జో మై చాహూ (సొమ్ము మీరు కోరినంత... పని నేను చెప్పినంత)

***

'షోలే' తన శబ్దాలతో కూడా మనకు కనెక్ట్ అవుతుంది. రైలు కూతా, గుర్రపు డెక్కల చప్పుడు, జట్కా మువ్వలు, అజాన్, దూది ఏకే కవాను, కమ్మరి మోత... ఇక ఈ సినిమాకు ముందు రివాల్వరు, రైఫిలు పేలితే అలాంటి సౌండ్ వస్తుందని ప్రేక్షకులకు తెలియదు. బ్రిటిష్ స్టంట్‌మెన్ ఈ సినిమాకు స్టంట్ కొరియోగ్రాఫర్లుగా పని చేశారు. ట్రైన్ రాబరీలో ఒక బుల్లెట్ తగిలి గూడ్స్ పెట్టెకు అంటించిన సర్కారు కాగితం చిట్లుతుంది. అలాంటి ఒక్క షాటు తర్వాతి కాలంలో తీయలేకపోయారు.

***

'షోలే' గొప్పతనం తెల్లార్లు చెప్పుకోవాలి. గబ్బర్ సింగ్ పేరు వాడుకుని ఒక హిట్ సినిమా తీసుకున్న మనం 'షోలే' యాభై ఏళ్ల సందర్భంగా ఉత్సవం తప్పక చేసుకోవాలి. ఈ సినిమాను తిరగేసి గుహనాథన్ కథ చెప్తే బాగుందని రామానాయుడు గారు 'కక్ష' తీశారు. ఇందులోని కొన్ని సీన్లు దర్శకేంద్రుడి 'అడవి రాముడు'కు పనికి వచ్చాయి. 'షోలే' ఎందరినో డైరెక్టర్లు అయ్యేలా చేసింది.

రైలుతో మొదలయ్యి రైలుతో ముగిసే ఈ సినిమా భారతీయ ప్రేక్షకులతో యాభై ఏళ్ల ప్రయాణం చేసింది.

ఇంకో యాభై ఏళ్లు ఇకపై చేస్తుంది.

ఏ దోస్తీ హమ్ నహీ తోడెంగే
తోడెంగే దమ్ మగర్ తేరా సాథ్ న ఛోడెంగె...
న ఛోడెంగె...

- కె.